క్లుప్తంగా

పాలిటెక్నిక్‌తో ఉత్తమ అవకాశాలు



పాలిసెట్ గ్రాండ్ టెస్టును పర్యవేక్షిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ

మురళీనగర్: పాలిటెక్నిక్ విద్యను అభ్యసించడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇనిస్టిట్యూట్ (గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. గైస్‌లో నిర్వహిస్తున్న పాలిసెట్ ఉచిత శిక్షణ తరగతులు ఆదివారం ముగిసిన సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెమికల్ ఇంజినీరింగులో విస్తృతమైన ఉద్యోగావకాశాలు ఉన్నాయని ఆయన చెప్పారు. మూడున్నరేళ్ల కెమికల్ ఇంజినీరింగు కోర్సులు చేసిన ప్రతి వారికి ఉద్యోగం వస్తుందని ఆయన చెప్పారు. తమ కాలేజీలో చదివిన 171 మందికి ఈ ఏడాది ఉద్యోగాలు వచ్చినట్లు ఆయన చెప్పారు. ఈనెల 30న నిర్వహించే పాలిసెట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించాలని ఆయన విద్యార్థులకు ఆశీస్సులు అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పాలిసెట్ మోడల్ గ్రాండ్ టెస్టు 150 మంది విద్యార్థులు రాశారు. పరీక్షను ఆయన పర్యవేక్షించారు.

ముగిసిన బాస్కెట్‌బాల్ పోటీలు



అండర్-17 పోటీల విజేతలతో కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జీత్, సిబ్బంది

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయ-వాల్తేర్‌లో ఈ నెల 24న ప్రారంభమైన హైదరాబాద్ రీజియన్, రీజినల్ బాస్కెట్‌బాల్ అండర్-17 పోటీలు ఆదివారంతో ముగిశాయి. హైదరాబాద్ రీజియన్ పరిధిలోని కేంద్రీయ విద్యాలయాల నుంచి మొత్తం 17 టీమ్‌ల బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఫైనల్స్‌లో హకీంపేట కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు విజేతలుగా నిలిచి గోల్డ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జీత్ విజేతలను అభినందించి మాట్లాడారు. విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలని, క్రీడలను కూడా చదువులో భాగంగా చేసుకోవాలని సూచించారు. జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ నాగభూషణం విజేతలకు మెడల్స్, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది రియాజ్‌ఖాన్, గిరి, రాణి, ప్రధానోపాధ్యాయిని శైలజ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులోనే గాయాలు

సీతమ్మధార: మద్యం మత్తులో తనంతట తానే పక్కనే ఉన్న రాయిపై పడటంతో తలపై గాయాలై రక్తస్రావమైందని, తనను ఎవరూ గాయపరచ లేదని అక్కయ్యపాలెం అబిద్‌నగర్‌కు చెందిన అవాల నర్సింగరావు స్పష్టం చేశాడు. ఈమేరకు ఆదివారం ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఈస్ట్ ఏసీసీ కె.లక్ష్మణ్‌మూర్తి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘటన వివరాలను నర్సింగరావు తెలిపాడు. ఈ నెల 11వ తేదీ రాత్రి అక్కయ్యపాలెం గ్రీన్‌బెల్ట్ పార్కులో గుర్తు తెలియని వ్యక్తులు తనను కొట్టి గాయపరచడంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నట్లు తన కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫోర్త్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారన్నాడు. చికిత్స అనంతరం ఈ నెల 21న తాను డిశ్చార్జ్ అయ్యానని, 22న పోలీస్ స్టేషన్‌కు వచ్చి జరిగిన సంఘటనను వివరించానన్నాడు. 11వ తేదీ రాత్రి మద్యం తాగిన కొద్దిసేపటికి ఇంటికి వెళ్లడానికి పార్కులోని బెంచ్ మీద నుంచి లేచినప్పుడు మద్యం మత్తులో తూగి పక్కనే ఉన్న రాయిపై పడటంతో గాయపడినట్లు నర్సింగరావు చెప్పాడు. సమావేశంలో సీఐ సత్యనారాయణ, ఎస్ఐ ఎస్.వెంకటరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంగీత విభావరి



సినీ గీతాలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

సీతంపేట: నారీ భేరి, శక్తి ఎంపవరింగ్ ఉమెన్ అసోసియేషన్, ఎంవీపీ స్వర సంగమం సంయుక్తంగా ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను ఆకట్టుకుంది. నగరానికి చెందిన గాయనీ గాయకులు సి.వి.రాజేశ్వరి, కె.భాగ్యలక్ష్మి, పద్మిని, రజిని, పుండరీ కుమార్, పెమ్మరాజు రామనర్సింహం, నాయుడు, స్వామి, ఉమాశంకర్, చింతా సుధీర్, బాబ్జి, వి.వి.చారి, భవ్య, కాశ్యప్ పలు తెలుగు చిత్రాల్లోని పాటలను మధురంగా ఆలపించి అలరించారు. కార్యక్రమంలో కళా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రా.. రమ్మంటున్న గ్రంథాలయాలు



మురళీనగర్ మహిళలు, పిల్లల గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న చిన్నారులు



పేపర్ రీడింగ్‌లో యువత

నేటి డిజిటల్ ప్రపంచంలో చాలా మంది పుస్తక పఠనాన్ని మర్చిపోయే స్థితికి చేరిపోయారు. పిల్లలు, పెద్దలు తీరిక దొరికితే టీవీ, ల్యాప్‌టాప్, మొబైల్, ట్యాబ్‌ల స్క్రీన్‌లకు అతుక్కుపోయే పరిస్థితికి అలవాటుపడి పోయారు. ఇది ఆరోగ్యంతోపాటు, మానసిక స్థితిపై అత్యధిక ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలో పుస్తకం మనకు నేస్తం కావాలి. పుస్తక పఠనం ద్వారా మనలోని మానసిక సమస్యలు, ఒంటరితనం వంటి వాటిని అధిగమించవచ్చు. మనలోని విజ్ఞానాన్ని, తార్కిక జ్ఞానాన్ని పెంచుకోవచ్చు. ముఖ్యంగా పిల్లలకు పుస్తకాన్ని మంచి నేస్తంగా అలవాటు చేయాలి. ఈ వేసవి సెలవుల్లో పుస్తక పఠనంపై విద్యార్థుల్లో ఆసక్తిని పెంచాలి. అందుబాటులోని గ్రంథాలయాలకు వారిని పంపించి పుస్తక పఠనంపై వారి అభిరుచిని పెంచాలి. అందుకు ఈ వేసవి ఒక వేదిక కావాలి.

– మురళీనగర్

- వేసవిలో పుస్తకాలు చదువుదాం రండి
- పుస్తక పఠనంతో జ్ఞానం, విజ్ఞానం, వినోదం మీ సొంతం
- ఆసక్తి చూపుతున్న చిన్నారులు, యువత

మురళీనగర్ పరిసర ప్రాంతాల్లో పుస్తక పఠనానికి అనేక అవకాశాలున్నాయి. ఇక్కడ అందుబాటులో ఉన్న గ్రంథాలయాలను వినియోగించుకోవాలి. ఆనాటి మహానుభావులందరూ గ్రంథాలయంలో పుస్తక పఠనం ద్వారానే గుర్తింపు తెచ్చుకున్నారు. మురళీనగర్‌లో మహిళలు, పిల్లలకు ప్రత్యేక లైబ్రరీ ఉంది. ఇక్కడ 13,676 పుస్తకాలు కొలువుదీరగా.. వీటిలో తెలుగు భాషలో 10,668, ఇంగ్లిష్‌లో 2,051, ఉర్దూలో 43, ఇతర భాషలకు సంబంధించి 7 రకాల పుస్తకాలు, గ్రంథాలున్నాయి. 8 దినపత్రికలు (3 ఇంగ్లీష్, 5 తెలుగు), రెండు వార పత్రికలు, స్వాతి, ఎంప్లాయిమెంట్ న్యూస్, పక్ష పత్రిక విజేత కాంపిటీషన్, మంత్లీ పత్రికలు (తెలుగు, ఇంగ్లీష్) ఇక్కడ చదువుకోవచ్చు. తెలుగులో సైన్స్ ఇండియా, వివేక్, యోజన, గ్రంథాలయం సర్వస్వం, ఇంగ్లిష్‌లో సీఎస్ఆర్ జీకే, బ్యాంకింగ్ సర్వీసెస్ క్రానికల్, కరెంట్ అఫైర్స్ అందుబాటులో ఉన్నాయి.

నచ్చిన పుస్తకం చదవండి

పుస్తకాన్ని మించిన **నేస్తం మరొకటి లేదు.** చేతిలో పుస్తకముంటే ప్రపంచాన్ని జయించవచ్చని పెద్దలు చెబుతారు. విద్యార్థులు వారి మేధస్సును పెంచుకోవాలంటే పుస్తక పఠనం చాలా అవసరం. ఇందుకోసం తమకు నచ్చిన పుస్తకాన్ని చదవడానికి ఆసక్తి పెంచుకోవాలి. ఇది తల్లిదండ్రుల నుంచే మొదలు కావాలి. విద్యార్థుల చేతికి ఎలక్ట్రానిక్ పరికరాలకు బదులు పుస్తకాలు అందించే సంప్రదాయం పెరగాలి. మీ పుట్టిన రోజు వేడుకలో పుస్తకాలు బహుమతిగా ఇవ్వడం ఎంతో ఆత్మ సంతృప్తిని కలిగిస్తుంది. పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి ఇదే సరైన సమయం.

ప్రయోజనాలు ఎన్నో..

ఓటీటీల యుగంలో బుక్ రీడింగ్ అలవాటు తగ్గడం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో రెగ్యులర్‌గా పుస్తకాలు చదవడం వల్ల అనేక ప్రయోజనాలున్నాయి.

- పుస్తకంలోని ప్రతి పేజీని అర్థం చేసుకుని చదవడం వల్ల సహనం, ఏకాగ్రత, సామర్థ్యం, పద సంపద, భాషపై పట్టు, సంభాషణ నైపుణ్యం, మేధస్సు, ఆలోచనా శక్తి వంటివి పెరుగుతాయి. – గొప్ప గొప్ప రచయితల పుస్తకాలు ఎంతో మంది జీవితాలను మార్చేస్తుంటాయి. పుస్తక పఠనం వల్ల మనలోని ఒత్తిడి మటుమాయమవుతుంది.
- వైఫల్యాలను ఎదుర్కొనే సమయంలో మనకు బుక్ రీడింగ్ బాగా మేలు చేస్తుంది.
- మన జీవితం వెలుపల జరిగే ఎన్నో సంగతులు మనకు పుస్తకాలు నేర్పుతాయి.
- టీవీ/మొబైల్ నిద్ర లేమి సమస్యలను పెంచుతాయి. పుస్తకం తెరిస్తే నాలుగు మంచి విషయాలు తెలియడమే కాకుండా ఇది నిద్రించే సమయమని మీ మెదడుకు చెప్పకనే చెప్పినట్లు ఉంటుంది.
- మానసికంగా ఇబ్బంది పడుతున్నప్పుడు ఒంటరితనాన్ని ఫీలవుతుంటాం. ఆ సమయంలో పుస్తకాలు మంచి నేస్తాలుగా మారుతాయి. అనేక కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడం ద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

మురళీనగర్ గ్రంథాలయంలో ప్రత్యేకంగా..

ఇక్కడి లైబ్రరీలో మహిళల కోసం ప్రత్యేకంగా సాహస మహిళలు, పురాణ ప్రాధాన్యం కలిగిన మహిళా గాథలు, ఇతిహాసాలు, వంటల పుస్తకాలు, ఫ్యాషన్ డిజైనింగ్, మానసిక శాస్త్రం, ఇంటింటి చిట్కా వైద్యం, హోమియో, ఆయుర్వేద వైద్యం, మహిళల ఆరోగ్య రక్షణ, జీవన నైపుణ్యాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ప్రతి రోజు ఉదయం 8.30 నుంచి 11 గంటలు, సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు గ్రంథాలయం తెరిచి ఉంటుంది. ప్రతి శుక్రవారం, రెండో శనివారం సెలవు. విద్యార్థులు పుస్తకాలను ఇంటికి తీసుకువెళ్లి చదువుకోవచ్చు.



మురళీనగర్ లైబ్రరీలో పుస్తక భాండాగారం



ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కులో గ్రంథాలయం

పార్కుల్లో పుస్తక పఠన కేంద్రాలు

మురళీనగర్‌లోని పార్కుల్లో కూడా బుక్ రీడింగ్ కేంద్రాలున్నాయి. వేసవిలో కనీసం గంట సేపు పార్కులకు వెళ్లి అటు ఆరోగ్యాన్ని.. ఇటు విజ్ఞానాన్ని పెంపొందించుకునే విధంగా పుస్తక పఠనాన్ని ఆస్వాదించవచ్చు. వాకర్స్ పార్కులో ప్రత్యేకంగా గ్రంథాలయం నిర్వహిస్తున్నారు. ఇక్కడ పురాణ, ఇతిహాస గ్రంథాలతోపాటు జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఉదయం, సాయంత్రం పార్కు తెరిచే సమయంలో గ్రంథాలయానికి వెళ్లి మనకు నచ్చిన పుస్తకాన్ని చదువుకోవచ్చు. ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కులో వివేకానంద యువ మహా మండలి గ్రంథాలయాన్ని నిర్వహిస్తోంది. ఇక్కడ యువకుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు ప్రతి ఆదివారం ఉదయం పుస్తక పఠనం, స్టడీ సర్కిల్ నిర్వహిస్తున్నారు. వివేకానందుడి రచనలు ఇక్కడ లభిస్తాయి. వీటిని విద్యార్థులు, యువకులు వినియోగించుకోవచ్చు. తమ క్యారెక్టర్ బిల్డింగ్‌కు ఇవి ఎంతో తోడ్పడతాయి.



వాకర్స్ పార్కులో వాకర్స్ రీడింగ్



వివేకానంద యువ మహామండలి ఆధ్వర్యంలో స్టడీ సర్కిల్

కె.కె. రాజుకు అభినందనలు



కె.కె. రాజును సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ ప్రతినిధులు



కె.కె. రాజుకి అభినందనలు తెలుపుతున్న 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి



కె.కె. రాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ డీసీసీబీ చైర్మన్ పల్లా చినతల్లి

సీతమ్మధార: వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి సోషల్ మీడియా సమావేశం నిర్వహించారు. పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మాజీ నెడ్‌క్యాప్ చైర్మన్, నియోజకవర్గ సమన్వయకర్త కె.కె. రాజుకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో సోషల్ మీడియా సైనికులకు కె.కె. రాజు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2029లో పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, పార్టీ కోసం కష్టపడ్డ వారిని గుర్తిస్తామని తెలిపారు. గతంలో మనం చేసిన అభివృద్ధిని, మంచిని చెప్తూ అందరికీ ఆమోదయోగ్యమైన భాషలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించాలని సూచించారు. ఈ సమావేశంలో ఐటీ వింగ్ అధ్యక్షుడు అనిల్ శర్మ, డానియేల్, రాజు, శ్రీను, వెంకట రమణ, వెంకటేష్, లావణ్య రెడ్డి, యశోదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పలువురు నేతల అభినందన..

మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విశాఖ జిల్లా పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర మాజీ నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె. రాజుకు ఆయన కార్యాలయంలో పలువురు పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, మాజీ రాష్ట్ర కళింగ కోమటి చైర్మన్ సూరిబాబు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆల్ఫా కృష్ణ, మాజీ డీసీసీబీ చైర్మన్ పల్లా చినతల్లి, మాజీ డైరెక్టర్ ప్రసాద్, పార్టీ నార్త్ ఎస్టీ సెల్ ప్రెసిడెంట్ సతీష్, వార్డు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాలభైరవ స్వామికి ఘనంగా పూజలు



వడమాలలో కాలభైరవుడు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డులోని శ్రీ మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వరస్వామి, అయ్యప్ప, షిర్డీ సాయిబాబా దేవస్థానంలో ఆదివారం మహాలక్ష్మి దుర్గమ్మ వారికి, కాలభైరవ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమావాస్య కావడంతో కాలభైరవ స్వామికి ఈ పూజలు జరిపారు. భక్తులు తెచ్చిన వడమాలను స్వామి వారికి అలంకరించారు. భక్తులు గుమ్మడికాయల్లో నెయ్యిదీపాలు వెలిగించి పూజలు చేశారు. దేవస్థానం అధికారుల పర్యవేక్షణలో ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, క్షీరాభిషేకరం జరిపారు. భక్తులు గోత్రనామాలతో పూజలు చేయించుకున్నారు. అంతకు ముందు గణపతి మహాస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ పూజా కార్యక్రమాల సందర్భంగా దేవస్థానం పరిసరాల్లో సందడి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది శివ, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా డ్రెయిన్ కల్వర్టు



మహారాణి పార్లర్ కూడలిలో ప్రమాదకరంగా ఉన్న డ్రెయిన్ కల్వర్టు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు మహారాణి పార్లర్ కూడలిలో తవ్వి వదిలేసిన డ్రెయిన్ కల్వర్టు ప్రమాదకరంగా మారింది. కొద్ది రోజుల కిందట 80 అడుగుల రోడ్డులో డ్రెయిన్లు బ్లాక్ అవడంతో మురుగు నీరు రోడ్డెక్కి ప్రవహించింది. డ్రెయిన్‌లో పూడిక తొలగించడానికి మహారాణి పార్లర్ కూడలిలో రెండు చోట్ల కల్వర్టుకు కన్నాలు పెట్టారు. పూడిక తొలగించాక డ్రెయిన్‌పై సిమ్మెంట్ పలకలు గాని, గ్రిల్స్ వంటి రక్షణ చర్యలు చేపట్టకుండా వదిలేశారు. దీంతో నిత్యం రద్దీగా ఉండే రహదారిలో ప్రమాదకరంగా ఉన్న గోతులపై సిమెంట్ పలకలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వీధి లైట్ల ఏర్పాటు



వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తున్న వెంకటరమణ

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులో వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ఈ మేరకు గాంధీనగర్, కళింగ నగర్, మాధవధార ప్రజలు వీధి దీపాలు వెలగడం లేదని కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్వయంగా ఆ శాఖ అధికారులతో మాట్లాడి ఆదివారం దగ్గరుండి వీధి దీపాలు ఏర్పాటు చేయించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. బి.తిరుమలరావు, ఆర్. అప్పారావు, ఆర్. పైడి రాజు, శ్యామ్, గణేష్, వినోద్, ఢిల్లీ, జీవీఎంసీ లైటింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

మురళీనగర్: మురళీనగర్ మహిళలు, పిల్లల గ్రంథాలయంలో ఈ నెల 28 నుంచి జూన్ 6 వరకు ఉచిత వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తామని లైబ్రేరియన్ వై.పద్మజ తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు జరిగే ఈ శిబిరంలో విద్యార్థులు పాల్గొనాలని ఆమె కోరారు. విద్యార్థులకు కథలు చదివించడం, పుస్తక సమీక్ష, పుస్తక పఠనం, నీతిక థలు చెప్పడంతోపాటు చిత్రలేఖనం, పెయింటింగ్, పేపర్‌క్రాఫ్ట్, డ్యాన్స్, క్యారమ్స్, పాటలు, ఆటల పోటీలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు నేరుగా లైబ్రరీకి వచ్చి తమ పేర్లు నమోదు చేసుకోవాలని లైబ్రేరియన్ కోరారు.

పహల్గాం మృతులకు ఘన నివాళి



పహల్గాం మృతులకు నివాళులు అర్పిస్తున్న ఈస్ట్‌కోస్ట్ రైల్వే మజ్దూర్ సంఘ్ ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: పహల్గాం ఉగ్రదాడి మృతులకు ఈస్ట్‌కోస్ట్ రైల్వే మజ్దూర్ సంఘ్, వాల్తేర్ డివిజన్, డివిజనల్ సెక్రటరీ డాక్టర్ వి. రవికిరణ్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ముందుగా వీరి ఆత్మ శాంతి కోసం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం రైల్వేస్టేషన్ వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. డివిజనల్ సెక్రటరీ డాక్టర్ వి. రవికిరణ్ ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. వీరికి మద్దతుగా నిలిచిన వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోరా, ఏడీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహాలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డివిజనల్ అసిస్టెంట్ సెక్రటరీ జి. బాల మురళీకృష్ణ, స్టేట్ సెక్రటరీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎంవీఎస్ నాయుడు, లోవరెడ్డి, దేవేంద్రరెడ్డి, ఇతర కార్యవర్గ సభ్యులు, వాల్తేర్ డివిజన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ద్వారకా ఎస్ఐ ధర్మేంద్ర

సీతమ్మధార: అల్లర్లు సృష్టించినా, రౌడీయిజం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఫోర్త్‌టౌన్ సీఐ సత్యనారాయణ హెచ్చరించారు. స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. వేలి ముద్రలతో పాటు సంతకాలు సేకరించారు. ముందుగా ఎవరెవరు ఏయే కేసుల్లో ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి అల్లర్లు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తగాదాలు, కొట్లాటల్లో తల దూర్చకుండా కుటుంబాలతో హాయిగా జీవించాలని సూచించారు. మీరు చేసే పనులపై ఎప్పటికప్పుడు పోలీస్ నిఘా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ చిన్నంనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ద్వారకా స్టేషన్‌లో..

ఆదివారం ద్వారకా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లకు ఎస్ఐ ధర్మేంద్ర కౌన్సెలింగ్ నిర్వహించారు. తగాదాలు, కొట్లాటల్లో తల దూర్చకుండా కుటుం బాలతో హాయిగా జీవించాలన్నారు. వారి రోజువారీ విధానాలపై ఆరా తీశారు. అల్లరు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లిం వివాహ పరిచయ వేదికకు అనూహ్య స్పందన



మాట్లాడుతున్న హైదర్ అలీ సింకా

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు టీఎస్ఎన్ కాలనీలో గల హోటల్ సింకా గ్రాండ్‌లో ఆదివారం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ముస్లిం ఉచిత వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. పెద్ద ఎత్తున ముస్లింలు హాజరయ్యారు. వారి అర్హతలను బట్టి తమ పిల్లలకు తగిన సంబంధాలను ఎంపిక చేసుకున్నారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు హైదర్ అలీ సింకా మాట్లాడుతూ తమ సొసైటీ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 8 సార్లు ఉచిత వివాహ పరిచయ వేదిక కార్యక్రమం ఏర్పాటు చేసామని, ఇప్పటి వరకు సుమారు 250 మంది వివాహాలు చేసుకుని ఒక్కటయ్యారని తెలిపారు. ఇది పూర్తిగా ఉచిత సేవ అని తెలిపారు. పేద ముస్లింలకు తమ సొసైటీ తరఫున షాదీ ఖర్చులు కూడా భరించి, ఉచితంగా వివాహాలు జరిపిస్తున్నామని సింకా తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ ప్రెసిడెంట్ హాజీ మీర్ అబ్బాస్ హుసేన్, హమీద్‌ఖాన్, కార్యదర్శి హాజీ సయ్యద్ అమీర్ జాన్, సహాయ కార్యదర్శి మహబూబ్ షరీఫ్, మహబూబ్ ఆలీఖాన్, షేక్ అహ్మద్ వలీ, షేక్ అబ్దుల్ మునీర్, రహమతుల్లా, సొసైటీ సభ్యులు అబ్దుల్ మునీర్, మొహ్మద్ లుక్మన్, మునీర్‌ఖాన్, ముషీద్, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ముస్లిం కుటుంబాలు పాల్గొన్నాయి.

రైల్వే ప్రయాణికులకు అవగాహన



టికెట్లు తనిఖీ చేస్తున్న కమర్షియల్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: రైలు ప్రయాణికుల భద్రత, సౌకర్యం దృష్ట్యా వాల్తేర్ డివిజన్ కమర్షియల్ సిబ్బంది ప్రత్యేక టికెట్ తనిఖీ డ్రైవ్‌లు చేపడుతున్నారు. విశాఖ రైల్వే స్టేషన్‌లో ఆదివారం టికెట్ తనిఖీలు నిర్వహించారు. సరైన టికెట్ లేకుండా రిజర్వేషన్ బోగీల్లో ప్రయాణించే వారికి, దివ్యాంగ కోచ్‌ల్లో ప్రయాణించే సాధారణ ప్రయాణికులకు అవగాహన కల్పించారు. సరైన టికెట్‌తో, సరైన రైలులో సుఖ ప్రయాణం సాగించాలని ప్రయాణికులకు సూచించారు. రద్దీగా ఉన్న బోగీల్లో ప్రయాణించడం వల్ల దొంగతనాలు, జరిగే అవకాశాలు ఉంటాయని, ఫుట్‌బోర్డుపై ప్రయాణం ప్రమాదకరమని హెచ్చరించారు.

జాగ్రత్తలతో నేత్ర సంరక్షణ



నేత్ర వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

మురళీనగర్: సెల్‌ఫోన్లు, టీవీలు ఎక్కువగా చూడటం వల్ల, వాటి నుంచి వెలువడే లైటింగ్ కంట్లోకి ప్రవేశించి రెటీనాకు నష్టం కలిగిస్తుందని డాక్టర్ రుషిక అన్నారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వాకర్స్ పార్కులో మ్యాక్స్ విజన్ ఆస్పత్రి, ఏఐఎన్‌యూ ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేత్ర సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శిబిరంలో 109 మంది స్థానికులకు ఉచిత నేత్ర వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్ హేమని, డాక్టర్ యామిని ఆధ్వర్యంలో జనరల్ పరీక్షలు నిర్వహించారు. 124 మందికి బీపీ, సుగర్ పరీక్షలు చేశారు. వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సనపల భానుప్రకాష్, సిహెచ్.ప్రసాదరావు, పూర్వ అధ్యక్షులు ఎ.రామకృష్ణారెడ్డి, ఎస్.బుచ్చయ్య, సంయుక్త కార్యదర్శి ఎస్.ప్రకాశరావు, కోశాధికారి ఆర్.నాగేశ్వరరావు, ఇతర కార్యవర్గ సభ్యులు శిబిరం నిర్వహణకు సహకరించారు.